# ముందస్తు బతుకమ్మ వేడుకలు

కడెం, అక్టోబర్ 12 : కడెం మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ముందస్తు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, చిన్నారులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కడెంతో పాటు, పలు విద్యా సంస్థల నుంచి విద్యార్థులు ఇండ్లకు ప్రయాణమయ్యారు. ఈ నెల 25వ తేదీ వరకు సెలవులుండగా, తిరిగి 26 నుంచి విద్యా సంస్థలు తెరుచుకోనున్నట్లు ఎంఈవో మధుసూదన్ తెలిపారు.

**దస్తురాబాద్‌లో..**

దస్తురాబాద్, అక్టోబర్ 12 : మండలకేంద్రంతో పాటు, పలు గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో విద్యార్థులు సందడి చేశారు. అలాగే దసరా సెలవుల సందర్భంగా విద్యార్థులకు ఇండ్లకు పయనమయ్యారు. విద్యార్థుల రాకపోకలతో బస్టాండ్ ప్రాంతాల్లో సందడి నెలకొంది.



దస్తురాబాద్ : బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు

**ఖానాపూర్‌లో..**

ఖానాపూర్ రూరల్, అక్టోబర్12 : ఖానాపూర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో గురువారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు కోలాటం, డీజే చప్పుళ్ల మధ్య నృత్యం చేశారు. బతుకమ్మలను గోదావరిలో నిమజ్జనం చేసి పూజలు చేశారు.

**పెంబిలో..**

పెంబి, అక్టోబర్ 12 : మండల కేంద్రంలోని విజన్ పాఠశాల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వాడ వాడల పువ్వులతో పేర్చిన బతుకమ్మతో ర్యాలీ నిర్వహించి ఆడిపాడారు. సాంప్రదాయ పాటలతో నృత్యాలు చేశారు. అనంతరం బతుకమ్మను చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో విజన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కడెం : బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు



మస్కాపూర్‌లో బీసీ బాలుర సంక్షేమ వసతి గృహం నుంచి ఇండ్లకు వెళ్తున్న విద్యార్థులు

## ఇంటి బాటలో విద్యార్థులు

ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 12 : ఖానాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ వసతి గృహల విద్యార్థులు దసరా సెలవులకు ఇంటిబాట పట్టారు. రాష్ట్ర ప్రభుత్వం దసరా సెలవులు ఈ నెల 13 నుంచి 26తేదీ వరకు సెలవులు ప్రకటించారు. ఈ మేరకు దూర ప్రాంతాల్లోని విద్యార్థులను తమ తల్లిదండ్రులు రావడంతో ఇంటి బాట పట్టారు. మస్కాపూర్ బీసీ బాలుర సంక్షేమ వసతి గృహం, కస్తూర్బా పాఠశాల నుంచి తమ గ్రామాలకు విద్యార్థులు తరలి వెళ్లారు. కాగా విజేత పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. పాఠశాల వార్డెన్ ప్రకాశ్, వాచ్‌మెన్ శ్రీనివాస్, వంట సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

## వాహనం ఢీకొని విద్యార్థి మృతి

నర్సాపూర్(జీ), అక్టోబర్ 12 : మండలంలోని బామ్నిలో ప్రమాదవశాత్తు వాహనం ఢీకొట్టడం తో విద్యార్థి మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బామ్ని తండాకు చెందిన రాథోడ్ యువరాజ్ (12) గురువారం బామ్ని పాఠశాలలో బతుకమ్మ కార్యక్రమాన్ని చూడడానికి వెళ్లాడు. కిరాణ షాపులో తినుబండరాలు కొనుక్కుంటున్న సమయంలో అకస్మాత్తుగా మహీంద్రా సుప్రో వాహనం విద్యార్థి పైకి దూసుకు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సతీశ్ అనే వ్యక్తి తన వాహనాన్ని ప్రక్కన ఆపి బయటికి వెళ్లన సమయంలో ముబొల్ల ముత్యం వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమయ్యాడు. నర్సాపూర్‌లోని ఎస్టీ వసతి గృహంలో ఆరో తరగతి చదువుతున్న యువరాజ్ ఇటీవలే ఇంటికి వచ్చాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.



యువరాజ్(ఫైల్)

## బాసరలో కొండ చిలువ పట్టివేత

బాసర, అక్టోబరు 12 : బాసరలో గురువారం భారీ కొండ చిలువ కనిపించింది. గ్రామంలోని వడ్డెర కాలనీకి కొండచిలువ కనబడడంతో పాములు పట్టే వ్యక్తి ఫయాజ్‌కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని కొండ చిలువను పట్టుకున్నాడు. అనంతరం దూర ప్రాంతంలో వదిలేశాడు.

## బయట జనాలతో అమిత్ షా సభ పెట్టారు

ఎదులాపురం, అక్టోబర్ 12 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కేంద్ర మంత్రి అమిత్ షా నిర్వహించిన సభలో కరీంనగర్, జాగిత్యాల్, మెట్‌పల్లి, కిన్వాట్, మహారాష్ట్ర సరిహద్దుల నుంచి జనాలను తరలించారని, దీనికి సభ విజయవంతమైందని బీజేపీ నాయకులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సమయంలో అమిత్ షా పర్యటించి ఆదిలాబాద్‌కు ఉపయోగపడే వరాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి ప్రస్తావన లేకుండానే సభ ముగిసిందని మండి పడ్డారు. సభలో కేంద్ర మంత్రి జిల్లా అధ్యక్షుడి పేరు పలకకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఎన్నికల సభ నిర్వ హించిన స్థానిక నాయకుడి పేరు ఎత్తకుండా మంచిర్యాల జిల్లా వివేక్‌ను జనాలకు పరిచయం చేయడం వెనకా ఆంతర్యం ఏమిటో అని వారికే తెలియాలన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గం లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా జోగు రామన్న గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. కారు సర్కారు గెలుపు కోసం ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.



నిర్మించిన వైకుంఠధామం



గ్రామపంచాయతీ కార్యాలయం

# గోసంపల్లె గోస తీరింది

- ప్రగతి పథంలో పరుగులు
- గ్రామానికి మహర్దశ
- కోటీ 70 లక్షలతో అభివృద్ధి పనులు
- ఆనందంలో గ్రామస్తులు

ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 12 : గ్రామాలాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీటను వేస్తున్నది. ప్రజల్లో మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యం గా ముందుకు సాగుతున్నది. ఖానాపూర్ మండలం గోసంపల్లె గ్రామంలో ఐదు ఏండ్లలోనే సుమారు రూ. కోటి 70 లక్షల అభివృద్ధి పనులకు మంజూరయ్యాయి. గతంలో ఉమ్మడి గ్రామ పంచాయతీ పాత ఎల్లాపూర్‌తో అనుసంధానంగా ఉండి ఇప్పుడు నూతన గ్రామపంచాయతీగా గోసంపల్లి ఏర్పడింది. ప్రభుత్వం ప్రతిష్ఠించిన పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. గ్రామంలో 11 లక్షల తో వైకుంఠధామం, రూ. 20 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రూ. 84 లక్షల తో సీసీరోడ్ల నిర్మాణం, నూతన విద్యుత్ సబ్ స్టేషన్‌ను నిర్మించారు. ఇవి కాకుండా పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం, డంప్ యార్డులు, సెంట్రల్ లైటింగ్‌లు సైతం ఏర్పాటు చేశారు.



నిర్మించిన సీసీ రోడ్డు

### గ్రామానికి మహర్దశ వచ్చింది..



మా గ్రామానికి మహర్దశ వచ్చింది. ప్రతి కాలనీలో వంద శాతం సీసీ రోడ్లను సర్కారు నిర్మించింది. కాంగ్రెస్ పాలనలో గతంలో ఇదే రోడ్లపై నాట్లు వేసిన పరిస్థితి ఉండేది. రోడ్ల వెంట డ్రైనేజీలు నిర్మించి గ్రామాలను అందంగా తీర్చిదిద్దారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కారమయ్యాయి. దీంతో గ్రామం ప్రగతి పథంలో దూసుకెళ్తున్నది.

**- గోసంపల్లె నామెడ ధర్మరాజు..**

### గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం..



మండలంలో సుమారు రూ. కోటి 70 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టాం. నూతన గ్రామపంచాయతీ, సీసీ రోడ్ల నిర్మాణం, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం, విద్యుత్ సబ్ స్టేషన్ సర్కారు నిర్మించింది. గతంలో వ్యవసాయం పనులకు రాత్రి కరెంట్ ఉండేది కాదు. లో వోల్టేజీతో సమస్యతో మోటర్లు కాలిపోయేవి. తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చొరవతో సబ్ స్టేషన్ ఏర్పాటైంది. పల్లెకు వెలుగులను తెచ్చింది. గ్రామంలో ఏలాంటి సమస్యలు లేకుండా చేసింది తెలంగాణ ప్రభుత్వం.

**టేకు గంగారాం, గ్రామ సర్పంచ్**